క్లుప్తంగా

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



క్రిష్టయ్యను పరామర్శిస్తున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: అధైర్య పడొద్దు.. అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ కార్యకర్త క్రిష్టయ్యకు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి భరోసా ఇచ్చారు. తాడిపత్రి పట్టణంలోని పాత కొటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త క్రిష్టయ్య దుకాణాన్ని టీడీపీ మూకలు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి బాధితుడి ఇంటికి వెళ్లి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని, అధైర్య పడొద్దు అంటూ భరోసా కల్పించారు.

లయన్స్ క్లబ్ కమిటీ ఏకగ్రీవం



మహబూబ్ బాషా, అధ్యక్షుడు

గుత్తి: పట్టణంలోని విరూపాక్షిరెడ్డి కల్యాణ మండపంలో మంగళవారం లయన్స్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ విరూపాక్షి రెడ్డి సమక్షంలో ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ కమిటీ అధ్యక్షుడిగా షేక్ మహబూబ్ బాషా, కార్యదర్శిగా శివ శంకర్, కోశాధికారిగా తిరుపతయ్య ఎన్నికయ్యారు.

శ్మశానంలో సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

యాడికి: మండల కేంద్రంలోని ముస్లిం శ్మశానంలో సమస్యలు పరిష్కరించాలని మంగళవారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి ముస్లింలు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పవిత్రంగా భావించే ముస్లిం శ్మశాన వాటికలో కొందరు మేకలు, పొట్టేళ్లు వధిస్తూ అపవిత్రం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా పలు సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జామియా మసీదు ముత్తువల్లి ఫక్రుద్దీన్, సయ్యద్, పుప్పాల పీరా, వేములపాడు షెక్షావలి, ఖాజాహుసేన్, పెద్ద ఖాజా, ఖాదర్, మహబూబ్ భాష, షక్షావలి, జిలాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



బేతాపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

గుత్తి రూరల్: సీజనల్ వ్యాధులు, డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. గుత్తి మండలంలోని బసినేపల్లి, బేతాపల్లి గ్రామాల్లో డెంగీ జ్వరాలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. రాత్రి పూట దోమతెరలు వాడాలరు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆంజనేయులు, ప్రభాకర్, లాజరస్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

యాడికి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే డెంగీ వంటి వ్యాధులు దరిచేరవని రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి దేవరాజు సూచించారు. ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకూ డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మంగళవారం రాయలచెరువు ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. పచ్చారుమేకలపల్లిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తాడిపత్రి సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ షబ్బీర్ బాషా, ఏఎన్ఎం రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిహాసంగా పింఛన్ల పంపిణీ



ఖాదర్‌పేటలో ఒకేచోట పింఛన్‌దారులకు డబ్బులు పంపిణీ చేస్తున్న స్పెషలాఫీసర్

పామిడి: మండలంలో మంగళవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ పరిహాసంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వేకువజామునే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ డబ్బులు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక వీధిలోనో? ఒక ప్రాంతంలోనో? పింఛన్‌దారులను క్యూలో నిలబెట్టి పింఛన్ల పంపిణీ చేపడుతుండడంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు. మండల ప్రత్యేక అధికారి వరప్రసాద్ ఖాదర్‌పేటలో లబ్ధిదారులను వరుసగా నిలబెట్టి పింఛన్ల పంపిణీ చేపట్టడాన్ని పలువురు విమర్శించారు.



తాడిపత్రి పట్టణంలోని గాంధీకట్ట



గాంధీకట్ట సమీపంలో చెత్తా చెదారం



అర్ధంతరంగా నిలిచిన ప్రహరీ నిర్మాణం

మహాత్మా.. మన్నించు..

- అధ్వానంగా గాంధీ స్మారకం పరిసరాలు
- అర్ధంతరంగా నిలిచిన స్మృతి వనం నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని మార్కెట్ వద్ద గాంధీ కట్ట అధ్వానంగా తయారైంది. తాగుబోతులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారికి నిలయంగా మారింది. రాత్రి సమయాల్లో తాగుబోతులు కట్టపై కూర్చొని మద్యం సేవిస్తుంటారు. మట్కా, ఇతర జూదరులు ఇక్కడ మకాం వేస్తుంటారు. మరోవైపు గాంధీ కట్ట పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. ఈ ప్రాంతాన్ని చూస్తే ఇక్కడున్నది గాంధీ స్మారక ప్రాంతమంటే ఎవరకైనా ఆశ్చర్యం, అనుమానాన్ని కలిగిస్తాయి.

స్వాతంత్రోద్యమాన్ని రగిల్చిన గాంధీజీ

స్వాతంత్ర సంగ్రామంలో తాడిపత్రి ప్రజలను భాగస్వామ్యం కల్పించి వారిలో స్వాతంత్రోద్యమాగ్నిని రగిలించేయడానికి తాడిపత్రికి వచ్చి ఈ ప్రాంతంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అప్పట్లో అనేక మంది డబ్బుతో పాటు బంగారం, ఇతర విలువైన వస్తువులను గాంధీజీకి విరాళంగా ఇచ్చి తమ స్వాతంత్రోద్యమానికి మద్దతుగా నిలిచారు. దీంతో ఈ ప్రాంతం గాంధీకట్టగా ప్రాచుర్యం పొందింది.

నిలిచిపోయిన గాంధీ స్మృతి వనం

గాంధీ కట్టను పునరుద్ధరించేందుకు మునిసిపల్ అధికారులు ప్రయత్నించారు. గతంలోని పాలకవర్గం ఆమోదంతో లక్షలాది రూపాయలు కేటాయించారు. గాంధీకట్టను అత్యంత సుందర వనంగా తీర్చిదిద్దడంతో పాటు స్మృతి వనంగా ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. గాంధీ కట్ట పరిసర ప్రాంతానికి ప్రహరీ నిర్మించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో గాంధీ కట్టను స్మృతి వనంగా మార్చడాన్ని అనేక కారణాలతో రాజకీయ పార్టీ నాయకుల మద్దతుదారులు అడ్డుకున్నారు. రాజకీయ జోక్యం కారణంగా ఎందుకొచ్చిన తంటా అనుకున్న మునిసిపల్ అధికారులు అర్ధాంతరంగా స్మృతి వనం పనులను నిలిపివేశారు. దీంతో గాంధేయవాదులకు కలత మిగిల్చింది.

స్మృతి వనంగా మార్చే ప్రయత్నం చేస్తాం



గాంధీకట్ట ప్రాంతాన్ని స్మృతి వనంగా మార్చే ప్రయత్నం చేస్తాం. ఇప్పటికే అక్కడున్న వ్యాపారులు, ఇతరులతో మాట్లాడి ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచిస్తున్నాం. గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు చుట్టూ ప్రహరీ, గ్రీనరీని ఏర్పాటు చేస్తాం. గాంధీకి సంబంధించిన ఫొటో గ్యాలరీని ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం. త్వరలో ప్రణాళిక రూపొందిస్తాం.

– శివరామక్రిష్ణ, మునిసిపల్ కమిషనర్

కౌలు రైతులకూ ‘అన్నదాత సుఖీభవ’ అందించాలి



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్

యాడికి(పెద్దవడుగూరు): కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని పెద్దవడుగూరు మండల సీపీఐ కార్యదర్శి వెంకటరాముడు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. మంగళవారం పెద్దవడుగూరులోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంతో వెంకటరాముడు యాదవ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు డాక్టర్ స్వామి నాథన్ కమిటీ సిఫారసులను వెంటనే అమలు చేయాలన్నారు. రైతులందరికీ పంటల భీమా అందజేయాలని నేత కార్మికులకు ఇవ్వాల్సిన రూ.36 వేలను అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ సభ్యులు రంగనాయకులు, హుస్సేన్ పీరా, సుధా కర్ రెడ్డి, సుధాకర్ గౌడ్, రఘురామయ్య, మునీంద్ర, రామాంజనేయులు, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా నిర్వహించండి



పెద్దపప్పూరు మండలం వరదాయపల్లిలో మాట్లాడుతున్న సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్



యాడికి మండలం చందనలో పీర్ల పెట్టెకు పొర్లు దండాలు పెడుతున్న భక్తులు

పెద్దపప్పూరు: మొహర్రం వేడుకలను హిందూ ముస్లింలు కలిసికట్టుగా జరుపుకోవాలని సీఐ రామసుబ్బయ్య సూచించారు. మంగళవారం రాత్రి మండలంలోని సమస్యాత్మక గ్రామమైన వరదాయపల్లిలో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొహర్రం ఉత్సవాలు చేయదలచుకుంటే ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో చిన్న సమస్య చోటుచేసుకున్నా ఉత్సవ కమిటీ సభ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల్లో మొహర్రం వేడుకలు

గార్లదిన్నె: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం మొహర్రం వేడుకలు ప్రారంభమైయ్యాయి. భక్తులు పీర్లకు చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 7న పీర్ల స్వాములు అగ్ని గుండం ప్రవేశం చేసి జలధికి వెళ్లనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

'చందన'లో పెద్దపీరు గ్రామోత్సవం

యాడికి: మండలంలోని చందన గ్రామంలో పీర్ల పెట్టె గ్రామోత్సవాన్ని మంగళ రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యానికి గురైన వారు, సంతానం లేనివారు, పీర్ల పెట్టె ముందర యువతీ యువకులు, పెద్దలు పొర్లు దండాలు చేస్తారు. ఇలా చేస్తే వారి కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. అనంతరం మకాన్ ఎదురుగా ఉన్న అగ్గి గుండాన్ని యువకులు పారలతో తవ్వారు. మకాన్‌లో ముజావర్లు పెద్దపీరు స్వామి, చిన్న పీరుస్వామి, బొడ్డుపీరు స్వాములు మరో 10 వివిధ రకాల పీర్ల స్వాముల ప్రథమ దర్శనాన్ని ముజావర్‌లు భక్తులకు కల్పించారు. 4వ తేదీ చిన్న సరిగెత్తు, 5న విడిదినం, 6న పెద్ద సరిగెత్తు, 7న పీర్ల జలధి, 9వ తేదీ పీర్ల స్వామి చివరి దర్శనం నిర్వహిస్తున్నట్లు ముజావర్లు ఖాజాహుసేన్, చాంద్‌బాషా తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఎన్ఎంయూ నాయకుడు



ఎస్ఎస్ వలిని వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న సతీష్‌రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లు: ఏపీఎస్ ఆర్టీసీ చెందిన నేషనల్ మాజ్దూర్ యూనియన్ నాయకుడు ఎస్ఎస్ వలి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం పట్టణంలోని పీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ విస్తత స్థాయి సమావేశానికి హాజరైన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపల్లి సతీష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, గుంతకల్లు సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి తదితరులు ఎస్ఎస్ వలితోపాటు బాషా, శివ, హరి, సురేంద్ర, హుసేన్ పీరా, మహ్మద్ తదితరులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి నాయకులు పిలుపునిచ్చారు.

సతీష్‌రెడ్డికి ఘన స్వాగతం

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో వైఎస్సాసీపీ రాష్ట్ర కార్యదర్శి, రాయలసీమ పరిశీలకుడు వేంపల్లి సతీష్‌రెడ్డికి మంగళవారం ఘన స్వాగతం పలికారు. గుంతకల్లు పట్టణంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి వస్తున్న సతీష్‌రెడ్డిని మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మియాదవ్, కౌన్సిలర్లు రూపవతి, వరదరాజులు, పట్టణ కన్వీనర్ కప్పలబండ మధుసూదన్‌రెడ్డి, నాయకులు గురుప్రసాద్ యాదవ్ జిల్లా సరిహద్దు వద్దకు చేరుకొని సతీష్‌రెడ్డిని పూలమాలలు, శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో కలిసి భారీ కాన్వాయ్‌తో వైఎస్సార్‌సీపీ నాయకులు గుంతకల్లుకు తరలివెళ్లారు. స్వాగతం పలికిన వారిలో నాయకులు కోనా మురళీధర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మాచినేని వరప్రసాద్, శేషారెడ్డి, జీవు రమణ, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పామిడి నుంచి భారీగా తరలిన వైస్సార్‌సీపీ శ్రేణులు

పామిడి: గుంతకల్లులో మంగళవారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి వైఎస్సార్‌సీపీ నాయకలు, కార్యకర్తలు కార్లు, సుమోలు, ద్విచక్రవాహనాల్లో పెద్దఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్ రెడ్డి, ఆర్ రామకృష్ణనాయక్, పార్టీ వివిధ విభాగాల మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్/గుత్తి: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలని కార్మిక జేఏసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్, సహాయ కార్యదర్శి సురేంద్ర డిమాండ్ చేశారు. మంంగళవారం కార్మికులు గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను కొద్దిసేపు లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు మస్తాన్, లక్ష్మీనారాయణ, సుంకన్న పాల్గొన్నారు. అలాగే గుత్తిలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం వర్కర్లు మంగళవారం ధర్నా, ర్యాలీ నిర్వహించి, కమిషనర్ జబ్బార్‌మియాకు వినతి పత్రం అందజేశారు. ఇంజినీరింగ్ విభాగం యూనియన్ అధ్యక్షుడు రాజా, యూనియన్ నాయకులు ఆది, రామాంజి, సూరి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా వాసవీ మాత



గుంతకల్లు: శాకంబరి అలంకరణలో అమ్మవారు



పామిడి: శాకంబరిగా గంగాభవాని

గుంతకల్లుటౌన్/పామిడి: గుంతకల్లు పట్టణంలోని కన్యక పరమేశ్వరి ఆలయంలో ఆషాఢ మాసం తొలి మంగళవారం పురస్కరించుకుని వాసవీ మాత అమ్మవారికి శాకంబరి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అందగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోపా జగదీష్, కందూరి కృపాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడి పట్టణంలోని బెస్తవీధిలోని గంగాదేవి మంగళవారం శాకంబరిమాత అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. పూజల అనంతరం భక్తులకు కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సచివాలయ ఏఎన్ఎంల బదిలీ

యల్లనూరు: మండలంలోని యల్లనూరు పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంల బదిలీలు జరిగినట్లు మంగళవారం సీహెచ్ఓ మధుకుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ యల్లనూరు సచివాలయం -1లో విధులు నిర్వహిస్తున్న శ్రీదేవిని వెన్నపూసపల్లి సచివాలయానికి, అచ్యుతాపురంలో విధులు నిర్వహిస్తున్న కాశీరానికి 85- నిట్టూరు, 85 నిట్టూరులో పని చేస్తున్న గౌరీదేవిని చుక్కలూరు పీహెచ్‌సీ పరిధిలోని పెద్దపొడమలకు బదిలీ చేశారన్నారు. పెద్దపప్పూరు సచివాలయం ఏయన్ఎంగా విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంను యల్లనూరు సచివాలయం -2కు, నాగసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో విధుల్లో నిర్వహిస్తున్న లలితమ్మను చిలమకూరు సబ్‌సెంటరు ఏఎన్ఎంగా బదిలీ చేశారు. అలాగే పీహెచ్‌సీలో అటెండరుగా విధులు నిర్వహిస్తున్న శ్వేతను పెద్దవడుగూరు పీహెచ్‌సీకి, తిమ్మంపల్లి పీహెచ్‌సీలో అటెండరుగా విధుల్లో ఉన్న దిలీప్‌ను యల్లనూరు పీహెచ్‌సీకి బదిలీ చేసినట్లు సీహెచ్ఓ తెలిపారు. కాగా ఏళ్ల కొద్ది పీహెచ్‌సీలో ఫార్మసిస్టుగా విధులు నిర్వహిస్తున్న గుల్జార్‌బేగంకు బదిలీ లేదా అని మండలంలో చర్చించుకుంటున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మంగళవారం పాఠశాలలో హెచ్ఎం శ్రీవాస్తవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎంగా పదోన్నతి పొందిన అనిల్‌కుమార్, వివిధ పాఠశాలలకు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు శ్రీధర్‌గౌడ్, శ్రీదేవి, వెంకటశేషయ్య, నరసింహులు, శ్రీనివాసులు, కేటీ శ్రీనివాస్‌రావు, ఆంజనేయులు, భారతిని తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు. తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పీసీ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

గుత్తి రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తన శుద్ధి చేసి పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడు, వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్ సూచించారు. మండలంలోని జక్కలచెరువు, తొండపాడులో మంగళవారం ఏడీఏ, ఏఓలు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, పురుగుల మందు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ మిత్రవిందమాధవి, వీఎస్ఏ మల్లిక,ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధి సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

గుంతకల్లు రూరల్: కౌలు రైతులు సబంధిత వీఆర్వో లేదా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించి కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ లీనా వసుంధర సూచించారు. మంగళవారం మండలంలోని కొంగనపల్లి, శంకరబండ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేరుశనగ పంటసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను రైతులకు ఆమె వివరించారు. ముడ్డుకుళ్లు తెగులు నివారణకు ఎకరాకు 400 గ్రాముల మాంకోజెబ్ మందును ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని, తామర పురుగు నివారణకు డైమిథోఎట్ 2 ఎంఎల్ మందును లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేయాలని సూచించారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించండి

యల్లనూరు: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించి, రుచికమైన భోజనాలను వండిపెట్టాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాము సూచించారు. మంగళవారం మండలంలోని నిట్టూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న పౌష్టికాహారం గురించి కార్యకర్త రుక్మిణిని అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం



గుంతకల్లులో డాక్టర్‌ను సన్మానిస్తున్న రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సుంకప్ప



గుత్తి ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్పను సన్మానిస్తున్న దృశ్యం



యాడికి మండలం రాయలచెరువు వైద్యులు అప్పయ్య, దేవరాజన్‌ను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



గుంతకల్లులో వైద్యులు, చార్టెడ్ అకౌంటెంట్లను సన్మానిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

గుంతకల్లు/గుంతకల్లుటౌన్/గుత్తి/యాడికి/పామిడి: గుంతకల్లు, గుత్తి, యాడికి, పామిడిలో మంగళవారం డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ‘వైద్యుడంటే ప్రాణం పోసే దేవుడు. ప్రతి ఒక్కరి జీవితంలో వైద్యుల పాత్ర అత్యంత కీలకం’ అని రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధీర్‌కార్వా, రవి అన్నారు. మంగళవారం గుంతకల్లులోని రోటరీ క్లబ్ లో వైద్యులు, చార్టెడ్ అకౌంటెట్స్‌ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కమలమ్మ, రామ్మూర్తి, రేణుక, హిమబిందు, గుప్త, కిరణ్‌రెడ్డి, అలేఖ్యరెడ్డి, విక్రమ్, గోవింద్, మంజూర్, చార్టెడ్ అకౌంటెంట్లు రాధాస్వామి, ఓబులేసు, అఖిల్‌నాయుడును రోటరీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ స్కూల్ చైర్మన్ శిరీష్, కరస్పాండెంట్ ఉమా, ఇన్నర్‌వీల్‌క్లబ్ కార్యదర్శి జ్యోతి, రొటేరియన్లు మాధవీలత, డీవీఎస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అవోపా ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన వైద్యులు ప్రభాకర్, వెంకటేష్, సాయిప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్ష, కార్యదర్శులు దారా రాము, సుబ్రమణ్యం కోశాధికారి కోటా రఘు, వెంకట్ పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రైల్వే ఆస్పత్రిలో డాక్టర్ డే ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి వీ.సుంకప్ప ఆధ్వర్యంలో వైద్యులు ఎన్.వేణుగోపాల్ రెడ్డి,పి.మురళీమోహన్‌తోపాటు ఆస్పత్రి సిబ్బందిని సన్మానించారు. అలాగే పట్టణంలోని నారాయణ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులను సన్మానించారు.

- గుత్తి ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం గుత్తి కోట సంరక్షణ సమితి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ ఎల్లప్పతో పాటు పలువురు వైద్యులను సత్కరించారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, లయన్స్ క్లబ్ ప్రతినిధి విరూపాక్షి రెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, గైడ్ రమేష్, ఓబులేసు, నారాయణ, జిలాన్, నిజాం తదితరులు పాల్గొన్నారు.
- యాడికి మండలంలోని రాయలచెరువు లయన్స్ క్లబ్ కార్యాలయంలో వైద్యుల దినోత్సవం నిర్వహించారు. రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారులు అప్పయ్య, దేవరాజన్‌ను లయన్స్ క్లబ్ ప్రెసి డెంట్ లక్ష్మీనారాయణ శెట్టి, సభ్యులు సత్కరించారు.
- పామిడిలో మంగళవారం యూత్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆయూష్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడును సత్కరించారు. యూత్ ఖాజా, బాబు, సూర్య, రవి, షెక్షావలి, వడ్డేరాము, అడ్వకేట్ సతీష్, సుబ్బు, జగదీష్, షర్మాస్, జీమీర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

యాడికి: మండల కేంద్రంలోని కోట వీధిలో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.34,100 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఈరన్న మంగళవారం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేష్, పోలీసులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హనుమేష్‌నగర్‌లో మంగళవారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ కొండయ్య తెలిపారు. జూదరుల నుంచి రూ.22,560 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.